ప్రధాన కూడళ్లలో ప్రమాదాలు

- భద్రతా చర్యలు కరువు
- ఏలూరు వన్‌టౌన్ వెళ్లే మార్గంలో పొంచి ఉన్న ప్రమాదం
- ట్రాఫిక్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో భద్రత కరువైంది. టూటౌన్ నుంచి వన్‌టౌన్‌లోకి వెళ్లేందుకు వినియోగించే కవ్రల వంతెన, వసంతమహల్ వంతెన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. టూటౌన్, త్రీటౌన్ ప్రాంతాల ప్రజలతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు వన్‌టౌన్ వెళ్లేందుకు పాతబస్టాండ్ సెంటర్, కవ్రల వంతెన కూడలి, వసంతమహల్ వంతెన కూడలి, జూట్ మిల్ సెంటర్ వంతెన కూడలి గుండా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో ఒక్క పాత బస్టాండ్ సెంటర్ మినహా మిగిలిన మూడు చోట్లా సిగ్నలింగ్ వ్యవస్థ లేదు. జూట్ మిల్లు సెంటర్‌లో రద్దీ సమయంలో సిబ్బంది ట్రాఫిక్ నియంత్రిస్తూ కన్పిస్తుంటారు. కవ్రల వంతెన, వసంతమహల్ వంతెన సెంటర్లలో సిగ్నల్స్ లేదా సిబ్బంది కన్పించరు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని నగర వాసులు అధికారులను కోరుతున్నారు.

అశాస్త్రీయంగానే కవ్రల వంతెన నిర్మాణం

ఏలూరు పాత, కొత్త బస్టాండ్లను కలిపే ప్రధాన రహదారిలో కవ్రల వంతెన, వసంతమహాల్ వంతెన ఉన్నాయి. వీటిలో కవ్రల వంతెన నిర్మాణం అశాస్త్రీయంగా ఉందని పలువురు ఇంజినీర్లు చెబుతున్నారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్‌కు వచ్చే మార్గంలో ఎత్తుగానూ, పాత బస్టాండ్‌కు వెళ్లే దారిలో సాధారణంగా ఉండేలా ఈ వంతెనను నిర్మించారు. వంతెనకు ఇరువైపులా రాకపోకలకు వీలుగా దారి కేటాయించారు. అయితే అటు పవర్‌పేట నుంచి వన్‌టౌన్ వచ్చే వాహనాలు వంతెన అప్‌లోని కటింగ్ ద్వారా రావాలి. అదేవిధంగా వన్‌టౌన్ నుంచి టూటౌన్ తదితర ప్రాంతాలకు వంతెన డౌన్ కటింగ్ మార్గం గుండా రాకపోకలు సాగించాలి. ఇక్కడ వాహనచోదకులు నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఈ సమస్యపై ప్రధానికి లేఖ

కవ్రల వంతెన ప్రాంతంలో సిగ్నలింగ్ వ్యవస్థతో పాటు సీసీ కెమేరాలు ఏర్పాటు, నిత్యం ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరుతూ ఏలూరుకు చెందిన ఇంజినీర్, బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు చలమల సత్యనారాయణ ప్రధాన మంత్రి కార్యాలయానికి ఈ నెల 16న లేఖ రాశారు. ఈనెల 22న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ప్రధానంగా కవ్రల వంతెన ప్రాంతంలో సిగ్నల్స్ లేకపోవడం, వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలకు నెలవుగా మారిందని లేఖలో పేర్కొన్నారు.



ఏలూరు కవ్రల వంతెన వద్ద రోడ్డు వద్ద పరిస్థితి



కవ్రల వంతెనపై నుంచి ఏలూరు వన్‌టౌన్‌లోకి రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు

వంతెన వద్ద వన్‌వే విధించాలి



బ్లాక్ స్పాట్ జంక్షన్‌గా పేరున్న పవర్‌పేట నుంచి వన్‌టౌన్ వెళ్లే మార్గంలోని కవ్రల వంతెన వద్ద వన్‌వే విధించాలి. ఈ ప్రాంతంలో సీసీ కెమేరాలు, సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. నిత్యం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు వీలుగా అవసరమైన సిబ్బందిని నియమించాలి.

– చలమల సత్యనారాయణ, ఇంజినీర్, బీజేపీ పూర్వ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఏలూరు

అశాస్త్రీయంగా కవ్రల వంతెన నిర్మాణం



పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో నిర్మించిన కవ్రల వంతెన నిర్మాణం అశాస్త్రీయంగా ఉంది. ఈ జంక్షన్ వన్‌టౌన్, టూటౌన్‌ల ఇంటర్ ఫేస్ వద్ద ఉంది. ఇది వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఆనుకుని ఉంది. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతంగా మారింది.

– దారపురెడ్డి వెంకటరత్నం నాయుడు, సివిల్ ఇంజినీర్, ఏలూరు

ఆధార్ తప్పుడు మ్యాపింగ్‌పై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): తమ ఆధార్ నంబర్లతో 25 మందికి తప్పుడు మ్యాపింగ్ చేశారంటూ బుట్టాయగూడెం మండలం కోయరాజమండ్రి గ్రామానికి చెందిన దారావతు సుబ్బారావు, వడిత్యా అరవాలరాజులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వెట్రి సెల్వికి ఫిర్యాదు చేశారు. నూతిరామన్నపాలెం సచివాలయంలో తమ ఆధార్ నంబరుతో 25 మంది హౌస్ హోల్డ్‌లో మాపింగ్ అయ్యారని, వారు ఎవరో తమకి తెలియదని పేర్కొన్నారు. దీనిపై పీజీఆర్ఎస్‌లో పలుమార్లు ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారం కాకుండానే అయినట్టు మెస్సేజ్‌లు పంపి ఫిర్యాదులను క్లోజ్ చేస్తున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మాపింగ్ చేసిన సచివాలయం వారికి వెంటనే షోకాజ్ నోటీస్ జారీ చేయమని ఆదేశించారని తెలిపారు. తప్పుగా మాపింగ్ వల్ల ప్రభుత్వ పథకాలు రావడంలేదని ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎయిడ్స్, లెప్రసీలకు మందులను క్రమం తప్పకుండా వాడాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. ఏలూరు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నెలవారి సమీక్ష సమావేశం సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఐసీటీసీ, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, ఐటీ గణాంకాలపై చర్చించారు. తొలుత డాక్టర్ లక్ష్మీనారాయణ జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జి.ఆదిలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోరాట ఫలితమే జీఎస్టీ రద్దు



విజయోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు చేసిన సందర్భంగా ఏలూరు బ్రాంచ్‌లో ఎల్ఐసీ ఏవోఐ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓఐ యూనియన్ నాయకులు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల దీర్ఘకాలిక ఏఓఐ పోరాటం ద్వారా జీఎస్టీని రద్దు చేశారని తెలిపారు. ఈ పోరాట విజయం పాలసీదారులకు అంకితం అని ఏవోఐ రాష్ట్ర కార్యదర్శి జి.రవి కిషోర్ అన్నారు. మరిన్ని ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉండాలన్నారు. జీఎస్టీ పేరుతో ప్రజలు నష్టపోయారని చెప్పారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డీవీ రామకృష్ణ, జోనల్ నాయకులు బి.రామ్మోహన్ రావు, డివిజన్ నాయకులు వైఎస్ కనకారావు, బ్రాంచ్ అధ్యక్షులు కోడె రాంబాబు సెక్రటరీ సూర నాగరాజు, కోశాధికారి కట్టా సుబ్బారావు, తాళం సురేష్ పోతన, ఎండీ షరీఫ్, జీఎస్ఆర్ చంద్రశేఖర్, పి.సాంబశివ రావు, ఈసీ మెంబర్స్ ఎస్ శ్రీదేవి కపిల సుజాత, ఏపీ రాజకుమారి పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు మండలం అధ్యక్షుడిగా తలారి జయరాజు, కార్యదర్శిగా వాడపల్లి రామారావు, ఉపాధ్యక్షుడిగా మానుకొండ సాయిబాబు, మండల సహాయ కార్యదర్శిగా బైరెడ్డి లక్ష్మణరావు, సభ్యులుగా అన్నవరెడ్డి రంగారావు, పైడిపాటి భాస్కరరావు, తలారి జ్యోతి కుమారి మరో 10 మందితో కమిటీని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికైంది. ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం సుంకరవారితోటలో సమావేశం నిర్వహించారు.

రేపు ఏపీటీఎఫ్ 1938 జిల్లా సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.రామ్మోహన్, జి.మోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఏలూరు నగరంలోని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించే సమావేశానికి ముఖ్యఅతిథిగా చీఫ్ ప్యాట్రన్ కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్ చిరంజీవి, రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు. విధాన పత్రంపై చర్చ, ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

10 గంటల పని రద్దు కోరుతూ నిరసన

ఏలూరు (టూటౌన్): టీడీపీ కూటమి ప్రభుత్వం 8 గంటల పని దినం స్థానంలో 10 గంటల పని దినం బిల్లు అసెంబ్లీలో ఆమోదించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేయడం కోసమే 10 గంటల పని దినం తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 139 సంవత్సరాల క్రితమే కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని మార్చాలనుకుంటే కార్మిక వర్గం సహించదని హెచ్చరించారు. కార్మికుల కనీస వేతన జీవోలు సవరించాలని ఎంతోకాలంగా కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకోని చంద్రబాబు యాజమాన్యాలకు దోచిపెట్టడం కోసమే పని గంటలు పెంపుదల చేస్తున్నారని ఆరోపించారు. ప్రదాని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తుండగా, వారి కంటే ముందే చంద్రబాబు కార్మిక చట్టాల సవరణలు చేస్తూ 10 గంటల దినాన్ని రాష్ట్రంలో కార్మిక వర్గంపై రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో కూడా మహిళలు పనిచేసే విధంగా చట్ట సవరణలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కనీస వేతనాలు లేక అలమటిస్తోన్న కోటి మంది కార్మికుల సంక్షేమం పట్టించుకోకుండా చంద్రబాబు కొద్దిమంది పెట్టుబడిదారుల కోసం కార్మిక చట్టాల్లో మార్పులు చేయాలనుకోవడం అవివేకమని అన్నారు. తక్షణమే పని గంటల పెంపుదల చేసే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం ఇస్సాక్, నాయకులు జె.గోపి, పి.రవికుమార్, వీవీఎస్ ప్రసాద్, ఎర్ర రాంబాబు, లోకేశ్వరి, అరుణకుమారి, మోహిద్దీన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పోలీసులకు ఎస్పీ అభినందన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఇటీవల నిర్వహించిన డీఎస్సీ–2025లో టీచర్ ఉద్యోగాలు సాధించారు. మండవల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అఖిల శ్రావణి, లక్కవరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న వనజారాణి, ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం సుబ్రహ్మణ్యం, ఏలూరు ఏఎస్ఎస్ పార్టీలో పనిచేస్తున్న యు.శ్రీనివాస్‌లు టీచర్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని, వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని ఘనంగా సత్కరించారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయ్ కుమార్ రాజు

దెందులూరు : పీజీఆర్ఎస్ స్మార్ట్ కార్డులు, ఇళ్ల స్థలాల పరిశీలన ప్రాధాన్యత అంశం కావాలని తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆర్ఐలు అన్ని గ్రామాల వీఆర్ఓలు, వీఆర్ఏలు రేషన్ డీలర్లతో గ్రామాల వారీగా సమీక్ష చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతిసమస్యపైనా క్షేత్రస్థాయి పరిష్కారం జవాబుదారితనం విధిగా ఉండాలని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు నాగమణి, ప్రియ అన్ని గ్రామాల వీఆర్ఓలు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



స్పెషాలిటీ క్లినిక్స్‌ను ప్రారంభిస్తున్న ఆసుపత్రి యాజమాన్యం

దెందులూరు: ఏలూరు ఆశ్రం హాస్పిటల్‌లో పలు విభాగాల్లో స్పెషాలిటీ క్లినిక్‌లు ప్రారంభించామని ఆశ్రం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హనుమంతరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ వృద్ధులకు ప్రత్యేక విభాగంతో పాటు క్యాన్సర్, కీళ్లు, ప్రెగ్నెన్సీ వైకల్యం, కీహోల్ ద్వారా లిగ్మెంట్ యూరో గైనకాలజీ తోపాటు మరిన్ని విభాగాల్లో స్పెషాలిటీ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడమన లక్ష్యమని తెలిపారు. డైరెక్టర్ రతీదేవి, అడ్వైజ్ బోర్డు మెంబర్ కృష్ణశాస్త్రి, స్పెషల్ క్లినిక్‌లు నిర్వహించే వైద్య ప్రముఖులు సిద్దేశ్వరి, వందన, రమేష్, రోహిత్, భరత్, గౌతమ్, ప్రదీప్, శ్రీనివాస్, శాంతయ్య, రాజరాజన్, సిబ్బంది పాల్గొన్నారు.


25న యూటీఎఫ్ బహిరంగ సభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న గుంటూరు శ్రీ వెంకటేశ్వర జ్ఞాన మందిరంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రవికుమార్ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఏలూరు జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే ముస్తఫా అలీ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో యూటీఎఫ్ రణభేరి పోస్టర్‌ను విడుదల చేశారు. రవి కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ప్రభుత్వ పాఠశాలలో సమాంతర మీడియం కొనసాగించాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. సెప్టెంబర్ 2004 కంటే ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, కోవిడ్ సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్లస్ టు హై స్కూల్స్ కొనసాగించాలని, ఎంటీఎస్ ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని, వారి పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలమైనా ఇప్పటివరకు పీఆర్సీ, ఐఆర్, డీఏ బకాయిలపై ఒక స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఇ.శివశంకర్, కె.కమల్ కుమార్, జి.అంజనాదేవి, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.మోహనరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ జిక్రియ, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



రణభేరి పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

బాలా త్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మ దర్శనం



జ్ఞాన సరస్వతి



12 పంపుల సెంటర్ వద్ద..



పత్తేబాద కనకదుర్గమ్మ



అగ్రహారం కన్యకాపరమేశ్వరి



బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ

- దేవీ నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలో సోమవారం శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, కలశస్థాపన, అమ్మవార్లకు అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. హోమాలు నిర్వహించారు. అమ్మవార్లకు విశేష పూజలు, కుంకుమార్చనలు చేవారు. వన్‌టౌన్‌లోని శ్రీ జ్ఞాన సరస్వతి, 12 పంపుల సెంటర్‌లోని కనకదుర్గమ్మ, శంకరమఠం కనకదుర్గమ్మ, పత్తేబాద కనకదుర్గమ్మ, బావిశెట్టివారి పేటలో కనకదుర్గాంబ ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమించారు. కనకదుర్గాంబ ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. అగ్రహారం కన్యకాపరమేశ్వరి, తంగెళ్లమూడిలోని సీతారామనగర్ చెరువుగట్టుపై ఉన్న విఘ్నేశ్వర, శ్రీరామ, కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



విఘ్నేశ్వర, శ్రీరామ, కనకదుర్గమ్మ



పత్తేబాద దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పని గంటల పెంపును విరమించుకోవాలి

ఏలూరు (టూటౌన్): టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 10 గంటల పని విధానాన్ని తీసుకొచ్చేందుకు బిల్లు ఆమోదించడాన్ని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, 139 సంవత్సరాల మేడే పోరాట స్ఫూర్తికి విఘాతం కలిగించే చర్యలను మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోట్లను మోదీ ప్రభుత్వం తీసుకొస్తే మేమేమి తక్కువ కాదన్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా ప్రస్తుతం అమలులో ఉన్న 8 గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచారని, ఫ్యాక్టరీల చట్టం 1948ని రాష్ట్రానికి వర్తించేలా సవరణలు చేసే బిల్లుకు ఆమోదం తెలిపారని వివరించారు. పనిలో పనిగా రాత్రి షిఫ్టుల్లో మహిళలతోనూ పని చేయించేందుకు వీలుగా చట్టంలో సవరణలు చేశారని, చట్టంలోని 54వ సెక్షన్ ప్రకారం కార్మికుడు 10 గంటలకు మించి పనిచేయరాదని పేర్కొంటూనే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అనుమతితో 13 పనికి లైసెన్సు ఇచ్చారని తెలిపారు. ఫ్యాక్టరీలో పని చేసే మహిళా కార్మికుల సమ్మతితో ఉదయం 6 గంటలకు ముందు, రాత్రి 7 గంటల తర్వాత పని చేయించుకోవచ్చని సెక్షన్ 66లో సబ్ సెక్షన్ 1(బి) లో మార్పులు చేశారని వివరించారు. స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ బిల్లు తీసుకువచ్చారని ఆరోపించారు. కార్మిక వర్గానికి నష్టం కలిగించే బిల్లును వెంటనే ఉపసమరించుకోవాలని లేని పక్షంలో మరో మేడే ఉద్యమాన్ని నిర్వహించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఎ.రవి హెచ్చరించారు.

బీఏను మేజర్ సబ్జెక్ట్‌గా ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ గ్రూప్ మేజర్ సబ్జెక్టుగా ఇవ్వాలని కోరుతూ మంగళగిరిలోని హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్తాకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆ వివరాలను ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.లెనిన్ ఏలూరులో ప్రకటించారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలలో అన్ని కోర్సులు ఉండాలని తెలిపారు. పొలిటికల్ సైన్స్‌ను అభ్యసించడానికి 20 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ సబ్జెక్టు బోధించడానికి ఇద్దరు అధ్యాపకులు ఉన్నారని, పొలిటికల్ సైన్స్‌ను మేజర్ సబ్జెక్టుగా తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండేళ్లలో డిగ్రీ కళాశాల పనులు పూర్తి చేస్తామని నారా లోకేష్ యువగళం యాత్రలో హామీ ఇచ్చినా, నేటికీ శంకుస్థాపన కూడా జరగలేదని ఆరోపించారు. డిగ్రీ కళాశాలకు వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ శివాజీ, ఎం జయంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం కోసం దీక్ష

దెందులూరు: గోపన్నపాలెంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన ఏనుగు రాంబాబు సోమవారం నిరాహార దీక్ష మూడు కూడళ్ల సెంటర్‌లో వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద ప్రారంభించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల, కేంద్రీయ విద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాల, ఉన్నత పాఠశాల మొదలైన సంస్థలతో గోపన్నపాలెం రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలను కలిగి ఉందన్నారు. ఇక్కడ గ్రంథాలయం లేకపోవడం బాధాకరమన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	36	బీళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	26	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
అనపకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – తిరుపతి	16.00	4830	32